

## దళిత మహిళపై దాడి ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు: కేవీపీఎస్

**హాలియా, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి)**

నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పీ.కే.మల్లెపల్లి గ్రామసభలో దళిత మహిళ, వీఓఏ గనిపల్లి మాధవిపై జరిగిన భౌతిక దాడి అమానుషమని, ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

వివరాలు 2లో




జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నల్గొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

ఆదివారం 04 అక్టోబర్ 2026 పేజీలు:14


# ప్రజల పక్షాన పని చేసే జర్నలిజం వ్యవస్థ అవసరం..



- మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి.
- ఏఐ.. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తత అవసరం...
- నిజానిజాలను నిర్ధారించి వార్తలందించాలి..
- ప్రజలకు జవాబుదారీగా జర్నలిజం ఉండాలి..

**నల్లగొండ టౌన్ అక్టోబర్ 3,(ప్రజా జ్యోతి):**

ప్రజల పక్షాన పని చేసే జర్నలిజం వ్యవస్థ అవసరమని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి అన్నారు. జర్నలిస్టులు వృత్తి గౌరవాన్ని నిలబెట్టేలా పని చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమా వేశ మందిరంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సామాజిక మాధ్యమాలపై నిర్వ హించిన ఒకరోజు వర్క్ షాప్ కు ఆయన ముఖ్యఅ తిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ..





# చిన్నారుల భవిష్యత్తుకు బాటలు..

## - అమీనాబాద్‌లో కొత్త అంగన్వాడి భవనం




**అనంతగిరి,అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి)**

అనంతగిరి మండలం అమీనాబాద్ గ్రామంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించేందుకు నూతన అంగన్వాడి భవనం అందుబాటులోకి వచ్చింది. ఎంజిఎన్ ఆర్ఇజిఎస్ నిధులతో రూ. 12 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన అంగన్వాడి భవనాన్ని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడి కేంద్రాలు ఎంతో కీలకమని అన్నారు. చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణ సేవలు అందించడంలో అంగన్వాడి సిబ్బంది ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.

మిగతా 2 లో

# కాంగ్రెస్‌కు ఓటు అడిగే నైతిక హక్కు లేదు

- పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్ష
- రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ?
- రూ.4 వేల నిరుద్యోగ భృతి ఏమయ్యాయి? - బీఆర్ఎస్ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి




**చింతలపాలెం, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి) :**

పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి విమర్శించారు. చింతలపాలెం మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

మిగతా 2 లో

ప్రజాజ్యోతి
ఆదివారం 04 అక్టోబర్ 2026

# ప్రజల పక్షాన పని చేసే జర్నలిజం వ్యవస్థ అవసరశీ..

మొదటిపేజీ తరువాయి

మారుతున్న సాంకేతిక తను అందిపుచ్చుకుని మెరుగైన జర్నలిజాన్ని ప్రజలకు అం దించేందుకు, అలాగే వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందిం చుకునేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా జర్నలిస్టులకు ఉపయోగపడుతుందని, దీనిని దృష్టిలో ఉంచు కొని రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నల్గొండ డివిజన్ పరిధిలోని జ ర్నలిస్టులకు ఉద్దేశించి ఒక రోజు వర్క్ షాప్ నిర్వ హిస్తున్నట్లు వెల్ల డించారు. అలాగే అక్టోబర్ 12న నాగార్జున సాగర్ లో కూడా నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల జర్నలిస్టులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సామాజిక మాధ్య మాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జర్నలిజంలో ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీ డియా ప్రభావం చాలా ఎక్కువగా ఉందని, దీన్ని సక్రమంగా విని యోగించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భం గా చైర్మన్ పత్రిక స్వేచ్ఛ, ప్రింట్ మీడియా, ఎలక్ట్రా నిక్ మీడియా, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా, విస్తృతార్థాలు, వర్కింగ్ జర్నలిస్ట్, వృత్తి పరమైన జర్నలిస్టు లు



తెలుసుకోవాల్సిన ప్రధాన చ ట్టాలు తదిత అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాం త్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టిఫిజిల్ ఇంటెలిజెన్స్ వచ్చిన తర్వాత ప్రతి పౌరుడు జర్నలిస్టులా వ్యవహరి స్తున్నారని, ఇలాంటి పరిస్థితుల లో వార్తల్లో ఏది నిజం, ఏది అబ ద్ధమో ప్రజలకు తెలిసేలా వార్త లందించాలని, ఏ ఐ,సోషల్ మీ డియా వాడకాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉం దని, ముఖ్యం గా ఇది జర్నలిస్టు లకు ఎంతో అవసరమని అన్నా రు. స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ప్రభావంతో మంచి తో పాటు, చెడు కూడా సంభవించే అవకాశం ఉందని, ఆర్టిఫిషియల్ ఇంటెలి జెన్స్ సద్వినియోగం అయ్యేలా జర్నలి స్టులు కృషి చేయాలని, రిపోర్టర్లు నిరాధార వార్తలు రాయ వద్దని కోరారు. ఈ సందర్భంగా ఆర్టిఫిజిల్ ఇంటెలిజెన్స్ పై టై మ్స్ అఫ్ ఇండియా ఎడిటర్ ఇన్వె స్టిగేషన్ ఉడుముల సుధా కర్ రెడ్డి, సోషల్ మీడియా పై నరసిం హస్వామిలు జర్నలిస్టు లకు శిక్షణ ఇచ్చారు. నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, నల్గొండ జిల్లా సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెం కటేశ్వర్లు, జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ ఓఎస్ డి రహమాన్, పిఆర్ ఓ శైలేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటు అడిగే నైతిక హక్కు లేదు

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల ముందు విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, అధికారంలోకి వచ్చాక వారిని ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేసిందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి ఇస్తామని చెప్పి మాట తప్పారన్నారు. హైదరాబాద్ లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థినులపై లాఠీచార్జి చేయించి, నిర్బంధ కేసులు పెట్టిన కాంగ్రెస్ నాయకులు.. ఇప్పుడు పట్టభద్రులను ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ఆయన నిలదీశారు. రైతులకు రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్ అందించడంలోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో కేవలం 6,700 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఉండగా, కేసీఆర్ పాలనలో ఆ సామర్థ్యాన్ని 21,750 మెగావాట్లకు పెంచిన ఘనత బీఆర్ఎస్‌దేనని గుర్తుచేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జాబ్ మేళాల పేరుతో కేవలం రిజిస్ట్రేషన్ల సంఖ్యను మాత్రమే చూపుతున్నారని, వాస్తవంగా ఎంతమందికి ఉపాధి కల్పించారో వెల్లడించడం లేదని నరసింహారెడ్డి విమర్శించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని సిమెంట్ ఫ్యాక్టరీల్లో స్థానికులకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారో మంత్రి స్పష్టం చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మాటలను నిరుద్యోగులు, విద్యార్థులు ఇక నమ్మే పరిస్థితిలో లేరని, రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పి బీఆర్ఎస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియ, బీఆర్ఎస్ గెలుపు కోసం నాయకులు చేపట్టాల్సిన కార్యాచరణపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మధిర సత్యనారాయణ, కె.ఎల్.ఎన్.రెడ్డి, కొప్పుల సైదిరెడ్డి, మాజీ మండల అధ్యక్షులు మోర్తాల వెంకటరెడ్డి, సర్పంచ్ కందుల రామకోటిరెడ్డి, ఉసిరికాయల వెంకట్ గౌడ్, గుజ్జుల నరసింహారెడ్డి, ప్రభాకర్, షేక్ షబీల్, రియాజ్, ధరావత్ నరసింహ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత మహిళపై దాడి ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు: కేవీపీఎస్

మొదటిపేజీ తరువాయి

శనివారం హాలియాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన గ్రామసభలో ఒక దళిత మహిళను కులం పేరుతో దూషిస్తూ, దాడికి తెగబడటం శోచనీయమన్నారు. బాధితురాలికి వెంటనే పోలీసు రక్షణ కల్పించాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో దళిత,గిరిజనులపై పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. దళితుల ఆత్మగౌరవ పరిరక్షణకు కేవీపీఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ నాయకులు కొండేటి నరేష్, కొండేటి చింటూ,కొండేటి సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల భవిష్యత్తుకు బాటలు.. అమీనాబాద్‌లో కొత్త అంగన్వాడి భవనం

మొదటిపేజీ తరువాయి

అంగన్వాడి కేంద్రాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అమీనాబాద్‌లో నూతన భవనం అందుబాటులోకి రావడం సంతోషకరమని, దీని ద్వారా చిన్నారులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించడంతో పాటు పౌష్టికాహారం, ఆరోగ్య సేవలు పొందే అవకాశం కలుగుతుందని అన్నారు. అదేవిధంగా గర్భిణులు, బాలింతలకు అంగన్వాడి కేంద్రం ద్వారా అందించే సేవలు మరింత సౌకర్యవంతంగా చేరేలా చూడాలని సూచించారు. భవనాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అంగన్వాడి కేంద్రం ద్వారా అందించే ప్రతి సేవను అర్హులైన లబ్ధిదారులకు సమర్థవంతంగా అందించాలని సిబ్బందికి సూచించారు. నూతన భవనం గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చిన్నారుల ఆరోగ్యం, విద్య, పౌష్టికాహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అంగన్వాడి సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# వేములపల్లి మండలం ఎంపీడీవో కార్యాలయం నందు తొమ్మిదవ పోషణ మాసం కార్యక్రమము

**వేములపల్లి అక్టోబర్ 3(ప్రజాజ్యోతి):-**

శనివారం వేములపల్లి మండల కేంద్రంలో సిడిపిఓ ఆదేశానుసారం తొమ్మిదవ పోషణ మాసం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధికారులు ఎమ్మార్వో, ఎంపీడీవో, ఎస్సై డి. వెంకటేశ్వర్లు గ్రామ సర్పంచ్ పుట్టల సందీప్, అంగన్వాడి సూపర్వైజర్ రజని, డాక్టర్ సుచరిత పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ సూచిత మాట్లాడుతూ తల్లులకు పోషకాహారం అనగా చిరుధాన్యాలు పప్పులు, ఆకుకూరలు కూరగాయలు పండ్లు పాలు గుడ్లు చేపలు నువ్వులు పల్లీలు బెల్లం ఖర్జూర మొదలగు ఆహార పదార్థాలు ప్రతినిత్యం భోజనంలో ఉండేలాగా చూసుకోవాలని మరియు బాల్యవివాహాలు జరగకూడదని దానివల్ల జరిగే నష్టాలను చిన్నపిల్లల అమ్మకాలు జరపకూడదని అక్రమ దత్తత ఇవ్వకూడదని తెలియజేసినారు గర్భిణిగా ఉన్నప్పుడు మత్తు పదార్థాలు సేవించకూడదని అలా చేసినట్లయితే పుట్టే పిల్లలు దివ్యాంగులుగా పుడతారని తల్లులకు తెలియజేయడం జరిగింది తదుపరి సామూహిక శ్రీమంతాలు,



అన్నప్రాసనలు, అక్షరాభ్యాసం నిర్వహించడం జరిగింది .ప్రతిజ్ఞ చేయించడం జరిగింది .ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఎమ్మార్వో హేమలత ఎంపీడీవో జ్యోతి ఎస్సై వెంకటేశ్వర్లు , సర్పంచ్ పుట్టల సందీప్ కుమార్ ఎంపీ ఓ లలిత , ఏపీఓ శ్రీనివాస రెడ్డి డాక్టర్ సుచరిత సూపర్వైజర్ పరిమి రజిని, పోషణ అభియాన్ బీసీ రమణి ,హెల్త్ సూపర్వైజర్ శాంతా, ఏఎన్ఎం శైలజ, అంగన్వాడీ టీచర్స్,



ఆశా వర్కర్లు, తల్లులు ,పిల్లలు పాల్గొన్నారు.

## పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

### - ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి కట్టంగూర్ శ్రీరిశాల వెంకటస్వామి

**నల్లగొండ అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**

కట్టంగూర్: నల్లగొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి కట్టంగూర్ శ్రీరిశాల వెంకటస్వామి కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుగా ఓటరు జాబితాలో పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై యువత, పట్టభద్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అర్హులైన పట్టభద్రులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలతో పాటు అవసరమైన ఇతర పత్రాలను సిద్ధం చేసుకుని, ఎన్నికల అధికారులు సూచించిన మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో పట్టభద్రుల పాత్ర ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని వెంకటస్వామి పిలుపునిచ్చారు.



## స్వయం ఉపాధితోనే గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత

### - మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి

### - ఉచిత శిక్షణతో 2,000 మందికి జీవనోపాధి కల్పించిన 'ఏకల్ గ్రామోత్తాన్'

### - 500 మంది అభ్యర్థులకు సర్టిఫికేట్ల పంపిణీ





**హాలియా,అక్టోబర్3(ప్రజా జ్యోతి)**

గ్రామీణ ప్రాంత మహిళలు, యువత స్వయం ఉపాధి కోర్సులలో శిక్షణ పొంది ఆర్థికంగా ఎదిగినప్పుడే గ్రామీణాభివృద్ధి,కుటుంబ సాధికారత సాధ్యమవుతాయని హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సుమంగళి ఫంక్షన్ హాల్ లో ఏకల్ గ్రామోత్తాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా టైలరింగ్,కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సులు పూర్తి చేసుకున్న మహిళలు,యువతీ యువకులకు సర్టిఫికేట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, ఫౌండేషన్ ప్రెసిడెంట్ రాయప్రోలు మురళీకృష్ణల చేతుల మీదుగా శిక్షణ పూర్తి చేసుకున్న 500 మంది అభ్యర్థులకు ప్రశంసా పత్రాలు (సర్టిఫికెట్లు)అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ పాలకుర్తి ప్రశాంత్,అనురాధల సౌజన్యంతో నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియా, పెద్దవూర, తిరుమలగిరి (సాగర్), నిడమానూరు,త్రిపురారం మండల కేంద్రాల్లో ఉపాధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. గత ఐదేళ్లుగా ఏకల్ గ్రామోత్తాన్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు సుమారు 2,000 మందికి టైలరింగ్,కంప్యూటర్, బ్యూటీషియన్, సేంద్రియ వ్యవసాయం వంటి రంగాలు, కోర్సులలో ఉచిత శిక్షణ ఇచ్చి స్వయం సమృద్ధికి తోడ్పాటు అందించడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో దక్షిణ భారత కోఆర్డినేటర్ వినయ్‌కుమార్ పాండే, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జిల్లా సహ కార్యవాహ మామిడి శ్రవణ్‌కుమార్,పతంజలి యోగా గురూజీ జానీ,ఫౌండేషన్ ఉపాధ్యక్షులు చెన్ను నర్సింహారెడ్డి,హాలియా 2వ వార్డు కౌన్సిలర్ నకిరేకంటి అన్నపూర్ణ సైదులు, శాటిలైట్ సెంటర్,కిసాన్ సంఘ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు సంఘం జాతీయ మహాసభలు జయప్రదం చేయండి రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

## - తుమ్మల వీరారెడ్డి సిపి(ఎం) జిల్లా కార్యదర్శి



**నార్కట్ పల్లి, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి): నార్కట్ పల్లి**

మండలం లోనిఎల్లారెడ్డిగూడెం గ్రామంలో నవంబర్ 15 నుండి 18 వరకు నల్గొండ పట్టణ కేంద్రంలో జరుగు రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపి(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ.... నవంబర్ 15వ తేదీన నల్లగొండ ఎన్జీ కాలేజీలో బహిరంగ సభను జయప్రదం చేయాలని జిల్లాలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కరెంటు కోతల్ని నివారించి 16గంటల నాణ్యమైన కరెంట్ ఇవ్వాలని కోరారు. ఒక పక్క ఎల్ నీనో మరోపక్క ప్రభుత్వ విధానాలు రైతులను అగాధంలోకి నెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రైతాంగని ఆదుకోవడం కోసం ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ముఖ్యమైన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ గా ఉన్న జ్ఞానేష్ కుమార్ ఇద్దరు ఎలక్షన్ కమిషనర్ కాదని ఏకపక్ష నిర్ణయాలతో ఒక పార్టీకి ఏజెంట్ గా మారారని ఆరోపించారు. ఆయన ఏకపక్ష నిర్ణయాలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. సర్ పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓటర్ల తొలగింపు పై తీవ్ర అభ్యంతరాలు వచ్చాయని అన్నారు. ఇవి ఏమి పట్టించుకోకుండా ముందుకు పోవడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని అన్నారు.ఫారం 6 మార్పులు ఓటర్ల జాబితా డేటా కేంద్రీకరణ పై ఇద్దరు ఎలక్షన్ కమిషనర్లు 14 సార్లు అభ్యంతరం వ్యక్తం చేసిన ఏకపక్షంగా నిర్ణయాలు చేయడం ఏంటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వానికి ఎన్నికల వ్యవస్థ పైన చిత్తశుద్ధి ఉంటే జ్ఞానేష్ కుమార్ ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు ఎస్ఆర్ వెంకటేశ్వర్లు, సిపిఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి బయన్న మండల కమిటీ సభ్యులు చెరుకు పెద్దులు, కుమ్మరి శంకర్, దండు రవి, బుల్లెద్దు సైదులు, కట్ట రామచంద్రం,శాఖ కార్యదర్శి దండు నాగరాజు, ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షుడు దండు శంకర్, దండు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ వడ్రంగి సంఘం అధ్యక్షుడిగా పసునూరి నరేంద్రచారి

**కొండమల్లేపల్లి, అక్టోబర్ ౩ (ప్రజాజ్యోతి):**

కొండమల్లేపల్లి మండల విశ్వబ్రాహ్మణ వడ్రంగి సంఘం అధ్యక్షుడిగా పసునూరి నరేంద్రచారి ఘన విజయం సాధించారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా పోలోజు మల్లేష్‌చారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొండ మల్లేపల్లి మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సంఘం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా మనమయ సంఘం ఉపాధ్యక్షులు సొనగంటి గోవర్ధనచారి, అధ్యక్షులు సల్లోజు శ్రీనివాసచారి, జిల్లా కార్యదర్శి నారోజు సైదాచారి, గౌరవ అధ్యక్షులు కర్నెకంటి జంగాచారి, మాజీ అధ్యక్షులు పసునూరి శేఖర్‌చారి, చెన్నయ్యచారి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి.ఈ సందర్భంగా సంఘం సభ్యులు నూతన అధ్యక్షుడిగా పసునూరి నరేంద్రచారిని, ప్రధాన కార్యదర్శిగా పోలోజు మల్లేష్‌చారిని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సంఘం సభ్యులు అభినందించారు.సంఘం అభివృద్ధికి, వడ్రంగి వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు.





# ఇసుక దందాకు చెక్.. అక్రమ రవాణా చేస్తే కేసులే!

## - తహసీల్దార్ కమలాకర్ హెచ్చరిక ట్రాక్టర్లు సీజ్.. అక్రమార్కులపై క్రిమినల్ కేసులు

**అనంతగిరి, అక్టోబర్ 03 (ప్రజా జ్యోతి)**



ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని అనంతగిరి తహసీల్దార్ కమలాకర్ హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.మండల పరిధిలోని కొత్తగూడెం, పాలేరు వాగు పరిధిలో అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తహసీల్దార్ తెలిపారు. కొందరు వ్యక్తులు రాత్రి, పగలు తేడా లేకుండా పడవలతో వాగుల్లో ఇసుకను తోడి, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు.ఈ నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మండలంలోని ఇసుక రవాణాపై నిరంతరం తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ కమలాకర్ స్పష్టం చేశారు.అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా వాగుల స్వరూపం దెబ్బతినడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రకృతి వనరులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై సమాచారం తెలిసిన వెంటనే రెవెన్యూ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలు, రైతులకు తహసీల్దార్ కమలాకర్ విజ్ఞప్తి చేశారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అధికారులు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు.

## జిల్లా కాంగ్రెస్ నాయకులు జెల్లా వెంకటేశం జన్మదిన వేడుకలు

**రామన్నపేట అక్టోబర్ 3(ప్రజా జ్యోతి)**



పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు జె ల్లా వెంకటేశం జన్మదిన సందర్భంగా జిల్లా పరిషత్ విశ్రాంతిభవనంలో శాలువాలు కప్పి సన్మానించినారు కేకు కట్ చేసి శుభాకాంక్షలు చెప్పినారు ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ ఉప సర్పంచ్ మోటే రమేష్ మాజీ ఎంపిటిసి సాల్వేర్ అశోక్ గుత్త నర్సిరెడ్డి బొడ్డు సాలయ్య మొహమ్మద్ నాసర్ గోదాస్ శ్రీమన్నారాయణ మొహమ్మద్ అక్రమ్ కేశవ దాస్ వెంకటేశం కోట సుధాకర్ సాల్వేర్ లింగం బొడ్డు శంకరయ్య కొండ శేఖర్ గౌడ్ కొమ్ము శేఖర్ గొరిగే శేఖర్ గొలుసుల ప్రసాద్ మొహమ్మద్ రిజ్వాన్ మిర్జా ఇనాయ తుల్లా బేక్ ముహమ్మద్ అజార్ మహమ్మద్ జానీ లవణం సాయి సైదాచారి కక్కిరేణి రవీందర్ తెల్ల ప్రసాద్ పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జువాజి శ్రీకాంత్ పట్టణ మహిళా అధ్యక్షురాలు భైరబోయిన శోభ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ప్రయాణికులకు ఆన్ లైన్ సౌకర్యం

## - కే. సురేష్ కుమార్ - యాదగిరిగుట్ట డిపో మేనేజర్

యాదాద్రి,అక్టోబర్ 4(ప్రజాజ్యోతి)



యాదగిరిగుట్ట నుండి దూర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికుల,కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆన్ లైన్ లో టికెట్లు బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పించినట్లు యాదగిరి గుట్ట డిపో మేనేజర్ కే. సురేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా డిపో మేనేజర్ కే. సురేష్ కుమార్ మాట్లాడుతూ యాదగిరిగుట్ట నుండి శ్రీశైలం వరకు డీలక్స్ బస్సులు నడుపుతు న్నామని ఆయన అన్నారు. ప్రతి రోజూ ఉదయం 6.00 గంటలకు యాదగిరిగుట్ట డిపో నుండి బయలు దేరి,06.20 నిముషాలకు భువనగిరి, 06.45 నిముషాలకు ఘటకేసర్, 07.15 ని లకు ఉప్పల్/నల్లచెరువు ద్వారా మహాత్మా గాంధీ బస్ స్టేషన్ ద్వారా శ్రీశైలం వెళుతుందని ఆయన అన్నారు. ఆర్టీసీ బస్సు సర్వీసు రిజర్వేషన్ నెం.1915 ద్వారా బుక్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. శ్రీశైలం నుండి సాయంత్రం 15.45 నిముషాలకు బయలుదేరి తిరిగి యాదగిరిగుట్ట కు వస్తుందన్నారు. అదే విధంగా,యాదగిరిగుట్ట నుండి రాయచూర్ కు 12.30, 15.00, 15.45, 16.30 మరియు 17.00 గంటలకు ప్రత్యేక డీలక్స్ బస్సులు నడుపుతు న్నామని ఆయన అన్నారు. ప్రతి డీలక్స్ బస్సు భువనగిరి ఘట్కేసర్, ఉప్పల్,హైదరాబాద్ (ఎం జి బి ఎస్ )మహబూబ్ నగర్, మక్తల్ ,ద్వారా రాయచూర్ వెళ్లి మరుసటి రోజు యాదగిరి గుట్ట కి వస్తుంద న్నారు.ఈ బస్సుల ఆన్ లైన్ రిజర్వేషన్ల కొరకు ఫోన్ నంబర్ 9063404773 ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

# చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెన్ పహాడ్ అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):

చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం పెన్ పహాడ్ మండల పరిధిలోని పొట్లపహాడ్ గ్రామంలో జరిగినది. మృతిని బందువులు,పోలిస్ వారు తెలిపిన వివరాలప్రకారం పొట్లపహాడ్ గ్రామానికి చెందిన కొండ నాగరాజు 37 సంవత్సరాలు లారి డ్రైవర్ గా పనిచేస్తుంటాడు, నాగరాజు గత కొంతకాలంగా అనారోగ్యంగా బాధపడుతుండడంతో, అతను ఈనెల 2 వ తారికున తీవ్ర అస్వస్థకు గురికాగా కుటుంబ సభ్యులు అతన్ని చికిత్సకోసం 108 అంబులెన్స్ ద్వార సూర్యాపేట గవర్నమెంట్ హాస్పిటల్ కు తీసుకువెళ్లారు.అక్కడ చికిత్సపొందుతూ అదే రోజు సాయంత్రం 04.00 లకు మరణించినాడు. మృతుని బార్య కొండ లావణ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు మరియు మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి మృతుని బంధువులకు అప్పగించినట్లు ఏయస్ఐ టి.రాములు, పీయస్ పెన్ పహాడ్ తెలియజేశారు.



# కొల్లూరులో మెడికల్ క్యాంపు

ఆలేరు అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి)

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొల్లూరు గ్రామంలో మెడిసిటీ హాస్పటల్ సహకారంతో గ్రామ సర్పంచ్ సుధారాణి శ్రీపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ గాజుల దశరథ సహకారంతో మహా మెడికల్ క్యాంపు నిర్వాహకులు మల్లేష్ వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం గ్రామపంచాయతీ ఆవరణం ముందు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపు కు రాష్ట్ర పిసిసి జనరల్ సెక్రెటరీ జనగాం ఉపేందర్ రెడ్డి , మున్సిపల్ చైర్మన్ బాలమణి భాస్కర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పారునంది భాస్కర్, పార్టీ మాజీ మండల అధ్యక్షులు వెంకటేశ్వరరాజు ఆలేరు చేనేత సంఘం అధ్యక్షులు శంకర్ రెండో వార్డ్ కౌన్సిలర్ మార్కు మరియమ్మ సమక్షంలో క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దీప, కొల్లూరు మాజీ సర్పంచ్ నరసయ్య, శంకరయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు ఆంజనేయులు, మహేష్ లక్ష్మయ్య బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.





# ఒకటవ వార్డును క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చడమే తమ ధ్యేయం

## - కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్

ఆలేరు అక్టోబర్ 3 ప్రజా జ్యోతి

యాదాద్రి భు ఆలేరు మున్సిపాలిటీ లోని ఒకటవ వార్డు పరిధిలోని పాత మున్సిపాలిటీ ఆఫీస్ నుండి దొంతిరి ఫంక్షనల్ వరకు రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన మట్టి, ఇసుకను శుభ్రం చేసి తొలగించడం జరిగింది.ఈ పారిశుధ్య పనులను ఒకటవ వార్డు కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్ స్వయంగా సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. వాహన దారులకు, కాలినడకన వెళ్లే ప్రజలకు రోడ్డు ప్రమాదాలు, ఇతర ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ఈ మట్టి, ఇసుకను తొలగించినట్లు తెలిపారు. వార్డును క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చడమే తమ ధ్యేయమని, ప్రజాసమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందు బాటులో ఉంటానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





# మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని కలిసిన బీర్ల ఐలయ్య

ఆలేరు అక్టోబర్ 3 ప్రజా జ్యోతి

తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి, రహదారులు, భవనాలు మరియు ప్రజలకు సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై మంత్రివర్యులతో చర్చించారు.



# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయం.!

## - హామీల అమలులో కాంగ్రెస్ విఫలం..- ఓటమి భయంతోనే కాంగ్రెస్ పోటీకి వెనుకాడుతోంది

## - మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

**హాలియా,అక్టోబర్3(ప్రజా జ్యోతి)**

నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయం ఖాయమని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం హాలియాలో నాగార్జునసాగర్ నియోజకవర్గ స్థాయి గ్రాడ్యుయేట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి మాజీ ట్రైకర్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్ హాజరయ్యారు.ఈ సందర్భంగా నోముల భగత్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో 12,000 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండేవారని,ఈసారి ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు గ్రామాలలో ఉన్న పట్టభద్రుల ఓటు నమోదు చేయించే బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు.తెలంగాణ వాదాన్ని,పట్టభద్రుల హక్కులను పరిరక్షించేందుకు గతంలో ఈ స్థానం గతంలో దిలీప్ కుమార్ పల్లా రాజేశ్వర్ రెడ్డిని గెలిపించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా



విద్యార్థులు, నిరుద్యోగ యువతను ఘోరంగా మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనపై పట్టభద్రులు, యువత తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు.సీఎం దేవుళ్ల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడటం తగదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల వల్లే రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ



చేసేందుకు ఆ పార్టీ అభ్యర్థులు వెనుకాడుతున్నారని,ఇది బీఆర్ఎస్ పార్టీ విజయానికి స్పష్టమైన నాంది అని స్పష్టం చేశారు.స్థానిక నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కష్టపడి పనిచేసి గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య,రవి నాయక్,కామళ్ళ జానయ్య,బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, గ్రామ శాఖ కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# వాగులో డంపింగ్ చేసే చెత్తను వెంటనే తరలించాలి, స్మశాన వాటికను వెంటనే ఏర్పాటు చేయాలి

## - ఒకటవ వార్డ్ కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్

**ఆలేరు అక్టోబర్ 3 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డులోని వాగులో వేసే చెత్తను వెంటనే తరలించి అలాగే వైకుంఠ ధామం (స్మశాన వాటిక) ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఒకటవ వార్డ్ కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్ మాట్లాడుతూ.. ఒకటవ వార్డు పరిధిలో చెత్త డంపింగ్ చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిత్యం ఇళ్ల నుండి సేకరించే చెత్తను వేయడానికి సరైన స్థలం లేక పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే వార్డులో స్మశాన వాటిక (వైకుంఠ ధామం) లేకపోవడం వల్ల ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు నిర్వహించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ రెండు సమస్యలు ప్రజల ప్రాథమిక అవసరాలకు సంబంధించినవని, కాబట్టి మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి తగిన స్థలాన్ని కేటాయించి డంపింగ్ యార్డ్, స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. వార్డు ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాము ఎల్లప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యాట శివ, పాశికంటి సంపత్ మరియు ఇతరులు పాల్గొన్నారు.



---

# దళితులను మోసం చేసిన సంతోష్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి..!

# బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్

## - రూ.5 లక్షల అప్పంటూ నమ్మించి.. ఎకరా 20 గుంటలు సేల్‌డీడ్

## - రూ.2 లక్షలే ఇచ్చి.. రూ.3 లక్షలకు బౌన్స్ చెక్కులతో తిప్పలు!

## - న్యాయం కోసం ఎస్పీని ఆశ్రయించిన బాధితురాలు, దళిత సంఘాల నాయకులు

**భువనగిరి,అక్టోబర్ 3(ప్రజాజ్యోతి)**

వలిగొండ,మండలం టేకుల సోమారం గ్రామానికి చెందిన పడమటి,సంతోష్ రెడ్డి మార్టిగేజ్ పేరుతో నమ్మించి ఎకరా 20 గుంటల భూమిని సేల్‌డీడ్ చేయించుకుని మోసం చేశారని ఆరోపిస్తూ భువనగిరి మండలం సమాత్‌పల్లి గ్రామానికి చెందిన దళిత మహిళ బిచ్చాల సరిత భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ని ఆశ్రయించారు. కుటుంబ అవసరాల కోసం రూ.5 లక్షలు అప్పుగా అడగగా.. భూమిని మార్టిగేజ్ పెడితే రుణం ఇస్తామని నమ్మించారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.2025 సెప్టెంబర్ 20న తన భర్త గణేష్‌ను భువనగిరి తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లి, మార్టిగేజ్ పత్రాలంటూ సంతకాలు చేయించారని, అనంతరం సర్వే నంబర్లు 96, 97లోని ఎకరా 20 గుంటల భూమిని సేల్‌డీడ్‌గా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి నాలుగు దఫాలుగా కేవలం రూ.2 లక్షలు మాత్రమే చెల్లించి, మిగిలిన రూ.3 లక్షలకు నగదు లేని చెక్కులు ఇచ్చి, ఖాళీ బాండ్ పేపర్లపై సంతకాలు తీసుకున్నారని తెలిపారు.అప్పు తిరిగి చెల్లించి భూమిని ఇవ్వాలని కోరినా స్పందించలేదని, భూమిని ఇప్పటికే ఇతరులకు విక్రయించానని బెదిరించినట్లు సరిత ఆరోపించారు. గత ఆగస్టు 19న భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, దీంతో ఎస్పీని ఆశ్రయించినట్లు ఆమె తెలిపారు.



భూమిని తిరిగి తమ పేరుపై నమోదు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.దళితులను మోసం చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ డిమాండ్ చేశారు. ఎస్పీని కలిసిన వారిలో జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు బండారు రవివర్ధన్, దళిత సంఘాల నాయకులు బట్టు రామచంద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ మైలారం వెంకటేష్, కర్తల శ్రీనివాస్, ఇటికల దేవేందర్ మాదిగ, బొల్లెపల్లి అశోక్, కుతాడి సురేష్, ఎండి షఫీక్ అహ్మద్ మాజీ కౌన్సిలర్, అందే సాయి తదితరులు ఉన్నారు.

# జంగా వెంకన్న ను పరామర్శించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్





**మిర్యాలగూడ, అక్టోబర్ 03, (ప్రజాజ్యోతి ):** మిర్యాలగూడ మండలం గోగువారిగూడెం గ్రామానికి చెందిన జర్నలిస్ట్ వార్త లక్ష్మణ్ సోదరుడు , కాంగ్రెస్ నాయకులు జంగా వెంకన్న ను శనివారం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) పరామర్శించారు.వెంకన్న ఇటీవల విద్యుత్ ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి, ఒక చేతిని కోల్పోయారు.ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి వెంకన్న స్వగృహానికి వెళ్లి వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ప్రమాదానికి సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.వెంకన్న త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. అలాగే ఈ కష్టకాలంలో వారి కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ముందుంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చెక్ పవర్‌పై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

## గుడిపల్లి సర్పంచ్

## కున్‌రెడ్డి రాజశేఖర్‌రెడ్డి



**గుడిపల్లి, అక్టోబర్ 03,(ప్రజా జ్యోతి) :** చెక్ పవర్‌కు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని గుడిపల్లి సర్పంచ్ కున్‌రెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. నిర్ణీత కాలపరిమితిలో సమస్యకు పరిష్కారం చూపేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సానుకూల చర్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు.సర్పంచ్, ఉపసర్పంచ్‌ల మధ్య ఏర్పడే సమస్యలను వ్యక్తిగత విభేదాలుగా కాకుండా గ్రామ పరిపాలన, పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించిన అంశంగా చూడాలని సూచించారు. గ్రామ అభివృద్ధి సజావుగా సాగాలంటే సర్పంచ్, ఉపసర్పంచ్‌లు పరస్పర సహకారంతో పనిచేయాలని కోరారు.అధికారాలు, బాధ్యతల విషయంలో భేదాభిప్రాయాలు ఉంటే ఘర్షణలకు తావివ్వకుండా చట్టపరమైన విధానాలు, పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి ప్రజా ప్రయోజనాలు, గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కున్‌రెడ్డి రాజశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు గ్రాడ్యుయేట్లు తమ ఓటుతో సమాధానం చెప్పాలి అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

### - అశోక్ బలవంతుల

**ఆలేరు, అక్టోబర్ 3 ప్రజా జ్యోతి**

అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని యువజన నాయకుడు, గ్రాడ్యుయేట్ అశోక్ బలవంతుల పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఆ హామీల అమలుపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కేవలం ఒక ఎన్నిక మాత్రమే కాదని, పట్టభద్రులు, నిరుద్యోగ యువత ఆకాంక్షలను ప్రభుత్వానికి తెలియజేసే ప్రజాస్వామ్య వేదికగా నిలుస్తాయని అశోక్ బలవంతుల అన్నారు. తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రభుత్వ విధానాలు, హామీలు, పనితీరుపై పట్టభద్రులు తమ అభిప్రాయాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా వ్యక్తం చేయవచ్చని పేర్కొన్నారు.2026 నవంబర్ 1ను అర్హత తేదీగా పరిగణిస్తూ, అర్హత కలిగిన పట్టభద్రులు ఫారం18 ద్వారా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈసారి తాజా ఓటర్ల జాబితా రూపొందిస్తున్నందున గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన వారు కూడా మళ్లీ నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. నవంబర్ 6, 2026లోపు అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు



తప్పనిసరిగా తన పేరును ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఓటరు నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకుని, తమ ఓటు హక్కును ఎవరూ కోల్పోకుండా జాగ్రత్త పడాలని పిలుపునిచ్చారు.“పట్టభద్రుల ఓటు కేవలం హక్కు మాత్రమే కాదుడ భవిష్యత్తును ప్రశ్నించే ప్రజాస్వామ్య ఆయుధం. అర్హత ఉన్న ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు కావాలి” అని అశోక్ బలవంతుల అన్నారు.

## కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించిన కౌన్సిలర్ శేక్ తాహేర బబ్లు

**భువనగిరి,అక్టోబర్ (ప్రజాజ్యోతి)**

భువనగిరి,మున్సిపాలిటీ పరిధిలో ని,8వ వార్డు లో దర్గా కమాన్,వద్ద మున్సిపాలిటీ జనరల్ ఫండ్ ద్వారా,మోరి పై స్లాబ్ వేయడానికి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారం భించిన కౌన్సిలర్ శేక్ తాహేరా బబ్లు ఈ కార్యక్రమం లో మున్సి పాలిటీ చైర్మన్ తంగెల్లపల్లి శ్రీవాణి రవికుమార్ మున్సిపాలిటీ డి ఈ, మరియు ఏఈ ఇతర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ 8వ,వార్డు అభివృద్ధితన ప్రధాన ధ్యేయమని అన్నారు అలాగే వార్డు లో ఇంకా చాలా అభివృద్ధి కార్యక్రమాలు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారం తొ చేపట్టాల్సి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎడబోయిన రమేష్ కూర శివ.పోతంశెట్టి దశరథ,కాంతమ్మ నీలం నారాయణ.సి హెచ్ విశ్వేవష్ రావు సిహెచ్ న్యాయ వాది రజని ఎండి ఆఫీస్ ఎండీ అఖిల్ ఎండీ,అక్రమ్ ఎండీ సమీ ఎండీ జహంగీర్ ఎండీ ఖాజా భాయ్ ఎండీ యూసుఫ్ భాయ్ ఎండీ అమర్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.



# నల్గొండలో జేవీఆర్ ఈవీ షోరూమ్ ప్రారంభం

**నల్గొండ జిల్లా, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి ప్రతినిధి):**

పట్టణంలోని దేవరకొండ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జేవీఆర్ ఈవీ మొబిలిటీ షోరూమ్‌ను డీఎస్పీ శివరామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్గొండలో ఈవీ షోరూమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ప్రస్తుతం పెట్రోల్ ధరలు అధికంగా ఉన్న నేపథ్యంలో బ్యాటరీతో నడిచే ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించడం ద్వారా ఇంధన ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలిపారు. అంతేకాకుండా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంతో వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు కూడా దోహద పడుతుందని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం షోరూమ్ యాజమాన్యం డీఎస్పీ శివరామిరెడ్డిని ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో జేవీఆర్ ఈవీ షోరూమ్స్ చైర్మన్ జె. వెంకటేశ్వరరావు, ఎండీ ఎస్. నీరజ ప్రసాద్ నాయుడు, తెలంగాణ సేల్స్ హెడ్ కొల్లు నరేష్, షోరూమ్ ఇన్‌చార్జి కంకణాల రమేష్‌రెడ్డి, పంతులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# విచ్చలవిడిగా బెల్ట్ షాపులు... చర్యలు తీసుకోవాలంటూ పంచాయతీ తీర్మానం

**మిర్యాలగూడ, అక్టోబర్ 03,(ప్రజాజ్యోతి):**

మిర్యాలగూడ మండలం జంకుతండా లో విచ్చలవిడిగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం గ్రామ పంచాయతీ ఏకగ్రీవంగా తీర్మానించింది. గ్రామపంచాయతీలో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా బెల్ట్ షాప్ లు నిర్వహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందుల పాలు అవుతున్నారని, మద్యం మత్తులో మందుబాబులు విచ్చలవిడిగా వ్యవహరిస్తూ మహిళలు, గ్రామ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని గ్రామపంచాయతీలో అనేకమంది ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. ఆయా బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జంకుతండ గ్రామపంచాయతీ గ్రామ సభలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు మాట్లాడుతూ బెల్టు షాప్ నిర్వాహకులు నిబంధనల ప్రకారం షాపులు నడుపుకోవాలని రాత్రంతా నడిపి గ్రామ ప్రజలనుభయాందోళనకు గురి చేయొద్దని కోరారు. రాత్రంతా బెల్ట్ షాపులు నడుపుతుండడంతో తాగుబోతులు వీధుల గుండా సంచరిస్తూ బాటసారులను మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఎక్సైజ్,పోలీస్ అధికారులు బెల్ట్ షాప్ నిర్వాహకులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ మేరావత్ చిన ధనమ్మ , వార్డు సభ్యులు రాజన్న, రమేష్,బుజ్జి, రామారావు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



# రెండు రోజుల్లోనే చోరి కేసు ఛేదించిన వన్ టౌన్ పోలీసులు

## అంతర్ జిల్లా దొంగ అరెస్టు, 1.20 లక్షల నగదు, బైక్ స్వాధీనం

**మిర్యాలగూడ, అక్టోబర్ 03,(ప్రజాజ్యోతి):**

మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడ చౌరస్తా మంజీరా బార్ లో జరిగిన చోరీ కేసును రెండు రోజుల్లోనే వన్టౌన్ పోలీసులు చాకచక్యంగా ఛేదించి శబాష్ అనిపించుకున్నారు. శనివారం వన్టౌన్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ ఎం. నాగభూషణరావు నిందితుడి వివరాలను వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురం కు చెందిన రమావత్ సైదులు పాత నేరస్తుడు. క్యాటరింగ్ పనులు చేసే అతను 2017లో స్నేహితుడు కార్తీక్ తో కలిసి ఖమ్మం పట్టణంలో బైక్ దొంగతనం చేసి పోలీసులకు దొరికిపోయాడు. జైలు నుండి విడుదలైన తరువాత హైదరాబాదుకు మకాం మార్చి పలు ప్రాంతాలలో 30కి పైగా చోరీలకు పాల్పడ్డాడు. పలు కేసుల్లో చర్లపల్లి జైల్లో ఉండి,ఇటీవల విడుదలై సొంతూరు మిర్యాలగూడ చేరుకున్నాడు. నాలుగు రోజుల క్రితం హాలియా పట్టణానికి వెళ్లి జూపిటర్ బైకును చోరీ చేసి తిరిగి మిర్యాలగూడ చేరుకొని ఈ నెల 1న, అర్ధరాత్రి మంజీరా బార్ లో దొంగతనానికి పాల్పడ్డాడు. కౌంటర్లో ఉన్న 1.46 లక్షల నగదు,4 మద్యం ఫుల్ బాటిళ్ల ను చోరీ చేసుకు వెళ్ళాడు. ఈ సంఘటనపై యజమానులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.ఈ చోరీ ని ఛాలెంజ్ గా తీసుకున్న సిఐ నాగభూషణరావు, ఎస్ ఐ వాసా ప్రవీణ్ కుమార్ లు తమ సిబ్బందితో సిసి ఫుటేజ్ లను, ఆధునిక టెక్నాలజీని




వినియోగించి నిందితుడు హుజూర్నగర్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు గుర్తించారు. చాకచక్యంగా నిందితుడిని మిర్యాలగూడ లో అరెస్టు చేసి అతని వద్ద 1.20 లక్షల నగదు, జూపిటర్ బైక్ ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, రిమాండ్ కు తరలించినట్లు సి ఐ తెలిపారు. రెండు రోజుల్లో కేసును చాకచక్యంగా చేదించిన సీఐ నాగభూషణ్ రావు తో పాటు, ఎస్సై ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ డి.బిక్కునాయక్ , రాజారాం, కానిస్టేబుల్ శీలం వెంకటేశ్వర్లు, నల్లగంతుల శ్రీను, గద్దల హుస్సేన్, రమేష్, వీరబాబు, నర్సింహా, ప్రసాద్ లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించారు.

# బైక్ దొంగల ముఠా గుట్టురట్టు - ముగ్గురి అరెస్ట్..9 బైక్‌లు స్వాధీనం



**గరిడేపల్లి,అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):**

మోటార్‌సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను గరిడేపల్లి పోలీసులు అరెస్ట్ చేసి,సుమారు రూ.3 లక్షల విలువైన 9 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.ఈ వివరాలను హుజూర్ నగర్ సీఐ చరమందరాజు శనివారం గరిడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. కలకోవాకు చెందిన మండవ శివశంకర్ కీతవారిగూ డెంలో నిలిపిన ఎఖ్ఖీ డీలక్స్ బైక్ చోరీపై కేసు నమోదు చేసిన పోలీసు లు దర్యాప్తు చేపట్టారు.శనివారం కల్మల్ చెరువు ఎక్స్‌రోడ్ వద్ద ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేస్తుండ గా పోలీసులను చూసి తప్పించుకునేం దుకు ప్రయత్నించిన ఇద్దరిని అదుపులో కి తీసుకున్నారు.వారి విచారణలో చోరీ ల గుట్టు బయటపడగా మరో నిందితు డిని కూడా అరెస్ట్ చేశారు.అరెస్టయిన తోకల మధు (22),కేమ ముగేష్‌కుమార్ (26),షేక్ జానీపాషా (23)లు 2024 లో కోదాడలో జద్గీ బైక్‌తో పాటు జూన్ నుంచి సూర్యాపేట,మిర్యాలగూడ, దామరచర్ల,రామన్నపేట,నార్కట్‌పల్లి, కీతవారిగూడెం తదితర ప్రాంతాల్లో బైక్‌లు చోరీ చేసినట్లు పోలీసులు తెలి పారు.చోరీ చేసిన ఆరు బైక్‌లను జానీపా షాకు అప్పగించి,మరమ్మతులు చేయిం చి విక్రయించేందుకు ప్రయత్నించినట్లు వెల్లడించారు.మరిన్ని బైక్‌లు చోరీ చేయా లని జానీపాషా రూ.5 వేల అడ్వాన్స్ ఇచ్చినట్లు తెలిపారు.కీతవారిగూడెంలో చోరీ చేసిన బైక్‌ను పొనుగోడులో విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా కొనుగోలుదారులు లేకపోవడంతో కార్‌షెడ్‌కు తరలిస్తుండగా నిందితులు పట్టుబడ్డారు.వారి సమాచారంతో మొత్తం 9 బైక్‌లను స్వాధీనం చేసుకున్న ట్లు సీఐ తెలిపారు.మరిన్ని చోరీల వివరా లు,వాహనాల యజమానుల గుర్తింపుపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.అప్పన్నపేటకి చెందిన బాలుడు పరారీలో ఉన్న ట్లు తెలిపారు.బైక్‌లకు తప్పనిసరిగా లాక్ వేసి,సీసీ కెమెరాల పరిధిలోనే పార్కింగ్ చేయాలని పోలీసులు సూచిం చారు.కేసును ఛేదించిన గరిడేపల్లి పోలీసులను అధికారులు అభినందించా రు.ఈ సమావేశంలో ఎస్ ఐ శ్రీకాంత్ గౌడ్,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు భారం కాకుండా ఇళ్ళ నిర్మాణం...

## - పార్వతిపురంలో మోడల్ ఇళ్లను పరిశీలించిన కౌన్సిలర్లు






**హాలియా,అక్టోబర్3(ప్రజా జ్యోతి)**

నాగార్జున సాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ సహకారంతో ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ సహాయాన్ని అర్హులైన ప్రతి పేద కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్లు పిలుపునిచ్చారు. పేదవారి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.కాంట్రాక్ట్ పద్ధతిలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను స్థానిక కౌన్సిలర్లు శనివారం పరిశీలించారు.ఆర్థిక స్థోమత తక్కువగా ఉన్న లబ్ధిదారులపై ఎలాంటి భార పడకుండా, తక్కువ వ్యయంతో ఎంతో నాణ్యతగా ఇళ్లను ఎలా నిర్మించుకోవచ్చో వివరించారు. ఇందులో భాగంగా పార్వతీపురంలో నిర్మించిన మోడల్ ఇళ్లను పరిశీలించి, వాటి నిర్మాణ పద్ధతులు, ఉపయోగించిన సాంకేతికతపై లబ్ధిదారులకు అవసరమైన విలువైన సూచనలు సలహాలు అందించారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు చెరుపల్లి ముత్యాలు,బొంగరాల యేసురాజు లబ్ధిదారులు గోని శ్రీరాములు గౌడ్,తక్కెళ్ళపల్లి నిర్మల కుమారి,జానీ బేగం,కాంట్రాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్వో ప్లాంట్ ప్రారంభం

**చింతలపాలెం, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):**

చింతలపాలెం మండలం గాంధీనగర్ తండాలో జువారి సిమెంట్ లిమిటెడ్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన తాగునీటి ఆర్వో ప్లాంట్‌ను శనివారం ప్రారంభించారు. జువారి సిమెంట్ ప్లాంట్ హెడ్ జీఎన్‌బీ రావు ప్లాంట్‌ను ప్రారంభించారు. సుమారు రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ ఆర్వో ప్లాంట్ 1,000 లీటర్ల సామర్థ్యం కలిగి ఉందని జీఎన్‌బీ రావు తెలిపారు. తండా ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు సీఎస్ఆర్ నిధులతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆర్వో ప్లాంట్ నిర్వహణను గ్రామ పంచాయతీ పర్యవేక్షిస్తుందని తెలిపారు. గతంలో తండాలో తాగునీటి ప్లాంట్ లేకపోవడంతో గ్రామస్తులు సమీపంలోని దొండపాడు గ్రామానికి వెళ్లాల్సి వచ్చేదని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం తండాలోనే తాగునీటి సౌకర్యం అందుబాటులోకి రావడంతో సమయం ఆదా కావడంతో పాటు మహిళలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జువారి సిమెంట్ సీఎస్ఆర్ సీనియర్ మేనేజర్ కరణం ఉగేంద్ర పిళ్లై, గ్రామ సర్పంచ్ బాణోతు పూరిబాయి, ఉప సర్పంచ్ అజ్మీరా త్రివేణి, గ్రామ కార్యదర్శి మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



## వర్ధమానుకోటలో ఘనంగా పోషణ్ మాసం

## అభివృద్ధి లోపాలున్న చిన్నారులను గుర్తించి వైద్య సేవలకు రిఫర్ చేయాలి

**నాగారం అక్టోబర్ 03 ప్రజా జ్యోతి.**

మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామ రైతు వేదికలో పోషణ్ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి లోపాలున్న చిన్నారులను గుర్తించి అవసరమైన వైద్య, ఆరోగ్య సేవలకు రిఫర్ చేయడంపై తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు.

**చిన్నారుల ఆరోగ్యంపై అవగాహన**

చిన్నారుల పోషణ, ఆరోగ్యం, ఎదుగుదల, పరిశుభ్రత, సమతుల్య ఆహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలలో తండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు కూడా చురుకుగా భాగస్వాములు కావాలని సూచించారు.

**అన్నప్రాశన అక్షరాభ్యాసం**

అనంతరం రైతు వేదికలో చిన్నారులకు అన్నప్రాశన, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం, పోషణతో పాటు ప్రాథమిక విద్యపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులు సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దేవేందర్ ప్రసాద్, సీడీపీఓ పి. శ్రీదేవి, సూపర్‌వైజర్ స్వప్న, సీహెచ్‌ఓలు విమలారెడ్డి, అరుణకుమారి, సర్పంచ్ ఆకుల బుచ్చిబాబు, ఉపసర్పంచ్ ఎం. తిరుపతమ్మ, పంచాయతీ కార్యదర్శి జె. అంబేద్కర్, పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ పి. శివశంకర్ చారి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, స్థానికులు పాల్గొన్నారు.



# పోలీసు ఉద్యోగ ఆశావహులకు 45 రోజుల ఉచిత శిక్షణ

## - 400 మంది అభ్యర్థుల ఎంపికకు అక్టోబర్ 4న స్క్రీనింగ్ పరీక్ష

## - జిల్లాలో నాలుగు కేంద్రాల్లో పరీక్షలు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 03(ప్రజా జ్యోతి):**

పోలీసు ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు సూర్యాపేట జిల్లా యంత్రాంగం,జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 45 రోజులపాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ,జిల్లా ఎస్పీ కె.నరసింహ తెలిపారు.శిక్షణకు అర్హులైన అభ్యర్థుల ఎంపిక కోసం అక్టోబర్ 4న ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఎస్ఐ,కానిస్టేబుల్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఉచిత శిక్షణకు సంబంధించిన దరఖాస్తులు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో స్వీకరించినట్లు తెలిపారు.

**నియోజకవర్గాల వారీగా పరీక్షా కేంద్రాలు**

సూర్యాపేట నియోజకవర్గం:సూర్యాపేట,ఆత్మకూరు, పెన్‌పహాడ్, చివ్వెంల మండలాల అభ్యర్థులకు సూర్యాపేటలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష నిర్వహిస్తారు.కోదాడ నియోజకవర్గం: కోదాడ,చిలుకూరు, అనంతగిరి, మునగాల, నడిగూడెం,మోతె మండలాల అభ్యర్థులకు కోదాడలోని కేఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో పరీక్ష ఉంటుంది.హుజూర్‌నగర్ నియోజకవర్గం: హుజూర్‌నగర్, గరిడేపల్లి,నేరేడుచర్ల, పాలకవీడు, మఠంపల్లి, చింతలపాలెం, మెల్లచెరువు మండలాల అభ్యర్థులకు హుజూర్‌నగర్‌లోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తారు.తుంగతుర్తి నియోజకవర్గం: తుంగతుర్తి, మద్దిరాల, నూతన్‌కల్, అర్వపల్లి, తిరుమలగిరి, నాగారం మండలాల అభ్యర్థులకు తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తారు.

**తప్పనిసరిగా తీసుకురావాల్సిన పత్రాలు**

స్క్రీనింగ్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు సమర్పించిన పోలీసు ఉద్యోగ దరఖాస్తు,



ఉచిత శిక్షణ కోసం చేసుకున్న దరఖాస్తు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతిని తప్పనిసరిగా తీసుకురావాలని అధికారులు సూచించారు.

**400 మందికి 45 రోజుల శిక్షణ**

స్క్రీనింగ్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన 400 మంది అభ్యర్థులను ఎంపిక చేసి 45 రోజులపాటు ఉచిత శిక్షణ అందించనున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో 200 మందికి, కోదాడలో 200 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఇండోర్, అవుట్‌డోర్ శిక్షణతో పాటు రాత పరీక్షకు అవసరమైన అంశాలపై నిపుణులతో శిక్షణ, నాణ్యమైన స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు కలెక్టర్, ఎస్పీ తెలిపారు.పోలీసు ఉద్యోగమే లక్ష్యంగా సిద్ధమవుతున్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్క్రీనింగ్ పరీక్షకు హాజరుకావాలని కోరారు.

**ప్రయాణంలో జాగ్రత్తలు పాటించాలి**

పరీక్షా కేంద్రాలకు వచ్చే అభ్యర్థులు ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కె. నరసింహ సూచించారు. ద్విచక్ర వాహనాలపై వేగంగా ప్రయాణించకుండా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వీలైనంత వరకు ప్రజా రవాణా, బస్సులను వినియోగించి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కోరారు.

# మిర్యాలగూడలో ఘనంగా 'జల్సా' ప్రోగ్రాం

## - నేర్చుకున్న విద్యతో సమాజాభివృద్ధికి పాటుపడాలి

## - ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

## - ఆలిమ్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థినులకు సర్టిఫికెట్ల పంపిణీ

**మిర్యాలగూడ, అక్టోబర్ 03,(ప్రజాజ్యోతి):**

కష్టపడి నేర్చుకున్న విద్య సమాజ అభివృద్ధికి ఉపయోగపడాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) ఆకాంక్షించారు. మిర్యాలగూడ పట్టణంలోని మినీ రవీంద్ర భారతి లో శనివారం నిర్వహించిన ఆమెనా మదర్సా నిర్వహించిన జల్సా కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమెనా మదర్సాలో ఆలిమ్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ మాట్లాడుతూ ఆలిమ్ కోర్సును పూర్తి చేయడానికి సుమారు ఐదు సంవత్సరాల పాటు క్రమశిక్షణతో, అంకితభావంతో విద్యను అభ్యసించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థినులు తమ విద్యను సమాజ అభివృద్ధికి ఉపయోగపడే విధంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. విద్య అనేది కేవలం జ్ఞానాన్ని సంపాదించుకోవడమే కాకుండా,మంచి నడవడిక, క్రమశిక్షణ, సేవాభావం,మానవత్వం మరియు సమాజం పట్ల బాధ్యతను పెంపొందించుకోవడం కూడా అని అన్నారు. ప్రతి ఒక్కరూ మహమ్మద్ ప్రవక్త చూపిన శాంతి, ప్రేమ,



సోదరభావం, కరుణ మరియు మానవతా విలువల మార్గంలో నడవాలని ఎమ్మెల్యే కోరారు. యువత విద్యతో పాటు మంచి విలువలను అలవర్చుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఆలిమ్ కోర్సును పూర్తి చేసిన విద్యార్థినులను , వారికి విద్యాబోధన అందించిన ఉలమాలు, ఉపాధ్యాయులు, మదర్సా



నిర్వాహకులు మరియు తల్లిదండ్రులకు ఎమ్మెల్యేఅభినందనలు, శుభాకాంక్షలుతెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ చిలుకూరి బాలకృష్ణ , మదర్సా నిర్వాహకులు, ఉలమాలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు, ముస్లిం మత పెద్దలు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలి

## - నామినేటెడ్ పదవుల్లోనూ సముచిత ప్రాధాన్యం కల్పించాలి

## - పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు లంబాడా నేతల విజ్ఞప్తి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 03(ప్రజా జ్యోతి):**

రానున్న తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో లంబాడా సామాజిక వర్గానికి మంత్రి పదవి కల్పించడంతో పాటు నామినేటెడ్ పదవుల్లోనూ సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని లంబాడా సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్లు,మేధావులు,కాంగ్రెస్ యువ నాయకులు కోరారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎన్నికల ప్రచార కమిటీ కో-కన్వీనర్ పృథ్వీరాజ్ నాయక్ జాటోత్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేసింది. తెలంగాణ జనాభా,సామాజిక,సాంస్కృతిక రంగాల్లో లంబాడా సమాజం కీలక పాత్ర పోషిస్తోందని ప్రతినిధులు పేర్కొన్నారు. సామాజిక న్యాయం,సముచిత ప్రాతినిధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాజకీయ పదవుల్లో లంబాడీలకు తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ లంబాడా సామాజిక వర్గానికి మంత్రి పదవి కల్పించే అంశంపై సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధులు తెలిపారు. మంత్రివర్గ విస్తరణలో లంబాడా సామాజిక వర్గానికి ప్రాధాన్యం కల్పిస్తామని, లంబాడీల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం కృషి చేస్తాయని ఆయన భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి దారావత్ వెంకన్న నాయక్, టీపీసీసీ రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ డాక్టర్ బానోత్ సంజయ్ నాయక్, టీపీసీసీ అధికార ప్రతినిధి తేజావత్ వెంకట్ నాయక్, తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు శివ రాథోడ్, ఉస్మానియా విశ్వవిద్యాలయ అధ్యాపకులు డాక్టర్ జె. బాలాకోటి నాయక్, ప్రొఫెసర్ డాక్టర్ అనంతరం, ప్రొఫెసర్ డాక్టర్ మొహినుద్దీన్, టీపీసీసీ డాక్టర్స్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వడ్త్యా రాహుల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన

## "సేవా సేతు అభియాన్" ప్రత్యేక అవగాహన కార్యక్రమం

**భువనగిరి,అక్టోబర్ 4(ప్రజాజ్యోతి)**

భువనగిరి పట్టణం లోని విద్యుత్ కార్యాలయం లో పీఎం, సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన "సేవా సేతు అభియాన్" పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్య క్రమంలో ప్రజలకు రూఫ్‌టాప్ సోలార్ ప్రయోజ నాలు,ప్రభుత్వ సబ్సిడీ దరఖాస్తు విధానం,బ్యాంకు రుణ సౌకర్యాలు,సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ప్రక్రియ మరియు,విద్యుత్ బిల్లులపై ఆదా వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్ ఈ,కె.సురేష్ కుమార్ డి ఈ టెక్నికల్ సుధీర్ డి ఈ ఆపరేషన్ ఎస్. వెంకటేశ్వర్లు,ఏడి,మచ్చేందర్ ఏఈ సాయి కృష్ణ కెనరా బ్యాంకు,ఎస్ బి ఐ హెచ్డీఎఫ్ ఫ్సీ బ్యాంకు తెలంగాణ గ్రామీణ,బ్యాంకు యూని యన్ బ్యాంకు తెలంగాణ కోఆపరేటివ్ బ్యాంకు అలాగే పత్రికా విలేకరులు కూడా కార్యక్రమంలో పాల్గొని పీఎం,సూర్య ఘర్ పథ కానికి సంబంధించిన వివరా లను ప్రజలకు తెలియ జేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికా రులు,రెడ్ కో సిబ్బంది, బ్యాంకు ప్రతినిధులు మరియు సోలార్ వెండర్లు కలిసి ప్రజలకు పీఎం,సూర్య ఘర్ పథకానికి సంబంధిం చిన సబ్సిడీ,రుణ సౌకర్యం దరఖాస్తు విధానం మరియు రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు ప్రక్రియపై ప్రత్యక్షంగా మార్గదర్శకత్వం అందిం



చారు. ప్రజలు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకొని రూఫ్‌టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లులపై ఆదా పొందడంతో పాటు స్వచ్ఛమైన సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమం లో మున్సిపాలిటీ చైర్మన్ తంగెల్లపల్లి శ్రీవాని కుమార్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



# మానవత్వం చాటుకున్న ఆర్యవైశ్య సంఘం

**హాలియా,అక్టోబర్3(ప్రజా జ్యోతి)**

ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ అనుముల మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు.ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన వారు ఎలాంటి కష్టాల్లో ఉన్నా తగిన సహాయ సహకారాలు అందిస్తూ అన్ని వేళలా అండగా ఉంటామని అనుముల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పోలా సైదులు భరోసా ఇచ్చారు. శనివారం హాలియాలో పలువురు బాధితులకు ఆర్యవైశ్య సంఘం నాయకులు అనుముల మండల అధ్యక్షుడు పోలా సైదులు,పట్టణ అధ్యక్షుడు మంచుకొండ ప్రభాకర్, యువజన సంఘం అధ్యక్షుడు పసుపు సతీష్ ల చేతుల మీదుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఇటీవల నల్గొండలో మరణించిన ఆర్యవైశ్యులు నీలా శివయ్య కుటుంబానికి రూ.30,000,ఆంధ్రప్రదేశ్ నుండి వలస వచ్చి హాలియాలో భక్ష్యాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న వెంకటాచలం భార్య కాలు ఆపరేషన్ నిమిత్తం రూ. 12,000,అలాగే క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తేలప్రోలు యాదయ్యకి రూ. 10,000 ఆర్థిక సాయం అందజేశారు.కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు యాదగిరి,నల్గొండ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు చీదెళ్ల లింగయ్య, హాలియా క్లబ్ అధ్యక్షుడు పొట్టుముత్తు వెంకటేష్,ఊరే వేణు,పోలా శ్రీనివాసులు, కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టిప్రోలు శ్రీనివాస్, కొత్త ప్రసాద్,మనోహర్,చీదెళ్ల రాంబాబు,హాకీ నాగరాజు, కొండూరు గణేష్,సముద్రాల శీను,కొండూరు శోభన్ బాబు,కె. సంతోష్,తేలప్రోలు ఉదయ్, ప్రభాకర్,వినోద్,పోలిశెట్టి మహేష్,గందే మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# అట్రాసిటీ కేసుపై డిఎస్పీ విచారణ

**చింతపల్లి అక్టోబర్ 03(ప్రజాజ్యోతి)**

చింతపల్లి మండలం పీ.కే మల్లెపల్లి గ్రామంలో శనివారం దేవరకొండ డిఎస్పీ ఎం.వి శ్రీనివాసరావు అట్రాసిటీ కేసుపై విచారణ చేపట్టారు.శుక్రవారం పీకే మల్లెపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో విఓఏగా విధులు నిర్వహించిన గనిపల్లి మాధవిపై మహిళ సంఘాల డబ్బుల వివాదంపై అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచి భర్త కొప్పోలు అమర్నాథ్ చేసిన దాడిపై చింతపల్లి పోలీస్టేషన్ అట్రాసిటీ కేసు నమోదైన విషయం తెలిసిందే.ఈ కేసు విచారణపై పీకే మల్లెపల్లి గ్రామానికి చేరుకొని బాధితురాలి నుండి వివరాలు సేకరించడంతో పాటు గ్రామస్తుల నుండి ఘర్షణకు సంబంధించిన వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు డిఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.



# వృద్ధుల హక్కులు, సంక్షేమంపై న్యాయ విజ్ఞాన సదస్సు






**నల్లగొండ అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**

నకిరేకల్: వృద్ధ తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లకు ఆర్థిక భద్రత, రక్షణతో పాటు గౌరవప్రదమైన జీవితాన్ని కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్ కుమారి మంజుల సూర్యవర్ సూచించారు.దేశ, రాష్ట్ర న్యాయ సేవా సంస్థల ఆదేశాల మేరకు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నకిరేకల్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి మంజుల సూర్యవర్ అధ్యక్షత వహించి, తల్లిదండ్రులు, వృద్ధుల నిర్వహణ, సంక్షేమం కోసం అమలులో ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వృద్ధ తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల సంరక్షణ, వారి హక్కుల పరిరక్షణ కోసం భారత ప్రభుత్వం 2007లో తల్లిదండ్రులు, వృద్ధ పౌరుల నిర్వహణ, సంక్షేమ చట్టాన్ని రూపొందించిందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం వృద్ధ తల్లిదండ్రులకు అవసరమైన పోషణ, ఆర్థిక భద్రత, రక్షణ కల్పించాల్సిన బాధ్యత పిల్లలపై ఉంటుందని వివరించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకుండా, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూచించారు.తల్లిదండ్రులు తమ స్థిర, చరాస్తులను పిల్లలకు బదిలీ చేసిన తర్వాత, వారు సంరక్షణ బాధ్యతలను నిర్వర్తించకపోతే చట్టంలోని నిబంధనల ప్రకారం ఆస్తుల బదిలీని రద్దు చేయించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వృద్ధుల సంరక్షణకు సంబంధించి సమస్యలు ఎదురైతే చట్టపరమైన హక్కులను వినియోగించుకోవాలని సూచించారు. యువత వృద్ధుల పట్ల గౌరవభావంతో వ్యవహరిస్తూ, వారి హక్కులను కాపాడాలని పిలుపునిచ్చారు. వృద్ధుల సంక్షేమానికి సంబంధించిన పలు చట్టాలు, న్యాయపరమైన అంశాలను వివరించారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నోముల గోవిందరాజులు, కొండా యాదగిరి, వంగూరి వెంకన్న, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పాపిరెడ్డి, వెంకటనారాయణ, విశ్రాంత ఉద్యోగులు, పారా లీగల్ వాలంటీర్ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీఆర్ హైస్కూల్ యాజమాన్యంపై డీఈవో ఆగ్రహం..

## - 45 రోజుల్లో సమగ్ర నివేదిక అందించాలని ఆదేశం..

## - నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవు..

**నల్గొండ అక్టోబర్ 03,(ప్రజా జ్యోతి):**

45 రోజులు గడిచినా పేరు మార్పు ప్రతిపాదనలు సమర్పించకపోవడంపై ఆర్టీఐ ఎస్ఎస్ పోరాటంతో ఎస్పీఆర్ హైస్కూల్ యాజమాన్యంపై డీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారనిరైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకుడు జాతీయ అధ్యక్షుడు కేతావత్ బాబురామ్ నాయక్, జిల్లా అధ్యక్షుడు కలకుంట్ల వినోదాచారి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలోని డీవీకే రోడ్డు, అదేవిధంగా కొండమల్లేపల్లిలలో సర్వేపల్లి రాధాకృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్పీఆర్ హైస్కూల్' అక్రమ నిర్వహణపై జిల్లా జిల్లా కలెక్టర్కు, విద్యాశాఖాధికారి పి. సుశీంద్ర రావు కు వినతిపత్రం సమర్పించడం జరిగిందని తెలిపారు . ఆర్టీఐఎస్ఎస్ సమర్పించిన పక్కా ఆధారాలు, వినతిపత్రాల ఆధారంగా జిల్లా విద్యాశాఖ అధికారిక ప్రొసీడింగ్స్ ఆర్సీ నెంబరు, 1455/బి2/2024, సెప్టెంబర్ 29న విడుదల చేసిందని వారు పేర్కొన్నారు. గౌరవ తెలంగాణ హైకోర్టు తీర్పు రిట్ పిటిషన్ నెంబరు 12250/2026, రంగారెడ్డి జిల్లా వాణిజ్య న్యాయస్థానం కమర్షియల్ కోర్టు శాశ్వత నిషేధాజ్ఞలు ఇంజంక్షన్ ఉత్తర్వులు, పాఠశాల విద్యా ప్రాంతీయ సంయుక్త సంచాలకుల ఆర్జేడీఎస్ఈ హైదరాబాద్ ఆదేశాల ప్రకారం ఎస్పీఆర్ అనే పేరును ఉపయోగించకూడదని గతంలోనే స్పష్టమైన ఆదేశాలు వెలువడ్డాయని వారు పేర్కొన్నారు. సదరు పాఠశాల యాజమాన్యం ఎస్పీఆర్ అనే పదం లేకుండా నూతన పేరు మార్పు కోసం దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ ఆదేశించినప్పటికీ, 45 రోజుల చట్టబద్ధమైన గడువు ముగిసినా ఎలాంటి ప్రతిపాదనలు సమర్పించకుండా యాజమాన్యం బేఖాతరు చేసిందని జిల్లా విద్యాశాఖాధికారి తమ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారని వివరించారని ఇప్పటికైనా ఎస్పీఆర్ అనే పేరు వాడకుండా తక్షణమే పేరు మార్పు ప్రతిపాదనలు పంపాలని, లేనిపక్షంలో తలెత్తే తీవ్ర చట్టపరమైన పరిణామాలకు కరస్పాండెంట్



వ్యక్తిగతంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని డిఇఓ హెచ్చరించడం జరిగింది అని తెలిపారు. పాఠశాల గుర్తింపు రద్దు కోసం ఆర్జేడీఎస్ఈ హైదరాబాద్ కార్యాలయానికి తదుపరి నివేదిక పంపుతామని డీఈవో ప్రొసీడింగ్స్‌లో గట్టిగా హెచ్చరించినట్లు వారు వెల్లడించారు. అనధికార పాఠశాలను తక్షణమే సీజ్ చేసి మూసివేసి విద్యాశాఖ నుండి నూతన పేరుతో అధికారిక అనుమతులు లేకుండా, న్యాయస్థానాల ఆదేశాలను ఉల్లంఘిస్తూ పాఠశాల తరగతులు నడపడం కొత్త విద్యార్థుల ప్రవేశాలు చేపట్టడం ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం తీవ్రమైన నేరమని వారు స్పష్టం చేశారు. వీటికి తోడు కొండమల్లేపల్లి క్యాంపస్ స్థానిక చెరువు యొక్క పూర్తి నీటి మట్టం బఫర్ జోన్ ముంపు ప్రాంతంలో అక్రమంగా నిర్మించబడిందని, కనీస అగ్నిమాపక రక్షణ అనుమతులు లేకుండా ప్రమాదకరంగా అక్రమ బాలుర హాస్టల్‌ను నడుపుతున్నారని ఆరోపించారు. తల్లిదండ్రులు ఇలాంటి వివాదాస్పద గుర్తింపు లేని సంస్థలలో పిల్లలను చేర్పించి మోసపోవద్దని వారు విజ్ఞప్తి చేశారు. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్న పాఠశాల ప్రాంగణాలను, అక్రమ హాస్టల్‌ను తక్షణమే అధికారులు భౌతికంగా సీజ్ చేసి మూసివేయాలని డిమాండ్ చేశారు.

# 352 ధాన్యం కొనుగోలు కేంద్రాల గుర్తింపు

## - తొలి దశలో 267 కేంద్రాల ప్రారంభానికి ఏర్పాట్లు

## - రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు

## - సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్





**సూర్యాపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 03(ప్రజా జ్యోతి):**

ఖరీఫ్ 202627 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను సజావుగా,పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.జిల్లాలో మొత్తం 352 ధాన్యం కొనుగోలు కేంద్రాలను గుర్తించగా,తొలి దశలో 267 కేంద్రాలను ప్రారంభించేందుకు ప్రతిపాదించినట్లు తెలిపారు.కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాలు, తేమ మీటర్లు, ప్యాడీ క్లీనర్లు, గన్నీ సంచులు, టార్పాలిన్లు, హమాలీలు తదితర మౌలిక వసతులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా అవసరమైన మేరకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వం నిర్దేశించిన ఎఫ్ఏక్యూ నాణ్యతా ప్రమాణాల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. రైతులకు టోకెన్ల జారీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.

### కొనుగోలు చేసిన ధాన్యాన్ని సత్వరం తరలించాలి

కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్రాల్లో ఎక్కువ కాలం నిల్వ ఉంచకుండా సంబంధిత గోదాములకు సత్వరమే తరలించేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు.రవాణాకు అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధం చేసి,కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.ధాన్యం రవాణా వాహనాల కదలికను జీపీఎస్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలను ఓపీఎంఎస్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసి, రైతులకు ఎలాంటి జాప్యం లేకుండా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన సన్న రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

### మధ్యవర్తులకు తావులేకుండా పర్యవేక్షణ

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మధ్యవర్తుల ప్రమేయానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావులేకుండా రైతుల నుంచి నేరుగా నిబంధనల ప్రకారం కొనుగోళ్లు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. నకిలీ ట్రక్ చిట్స్, తప్పుడు రవాణా వివరాలు, నకిలీ వాహనాల వినియోగం తదితర అక్రమాలకు అవకాశం లేకుండా క్షేత్రస్థాయిలో పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. రైతులకు నష్టం కలిగించే అక్రమాలు లేదా తప్పిదాలు గుర్తిస్తే బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కొనుగోళ్లు, నాణ్యత పరీక్ష,తూకం, రవాణా,గోదాం నిల్వ, ఓపీఎంఎస్ నమోదు, రైతులకు చెల్లింపులపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. హరి సింగ్,జిల్లా పౌరసరఫరాల అధికారి వి. మోహన్‌బాబు, జిల్లా మేనేజర్ (సివిల్ సప్లైస్) వి.శ్రీధర్‌రెడ్డి,అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేష్‌కుమార్,జిల్లా సహకార సూపరింటెండెంట్ కె. అంజయ్య, ఏఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి,సివిల్ సప్లైస్ అసిస్టెంట్ మేనేజర్ బెన్నర్జీ, డీఎంసీ/మెప్మా రమేష్‌నాయక్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రూ.26 కోట్లతో కోదాడ ఆసుపత్రి అభివృద్ధి

## -100 పడకల స్థాయికి అప్‌గ్రేడ్..

## కొత్త ఇన్‌పేషెంట్ విభాగం ప్రారంభం

## - ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యమే లక్ష్యం

## - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్





**సూర్యాపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 03(ప్రజా జ్యోతి):**

కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిని రూ.26 కోట్లతో 100 పడకల స్థాయికి అభివృద్ధి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు.ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన ఇన్‌పేషెంట్ విభాగాన్ని శనివారం స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి,జిల్లా ఎస్పీ కె.నరసింహతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు.30 పడకలుగా ఉన్న ఆసుపత్రిని 100 పడకల స్థాయికి పెంచేందుకు ప్రభుత్వం రూ.26 కోట్లు మంజూరు చేసిందని, నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. పూర్తయిన నూతన భవనాలు, ఇన్‌పేషెంట్ విభాగాలను వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు.ఆసుపత్రిలో అన్ని రకాల ఉచిత వైద్య సేవలు పునఃప్రారంభమైనందున కోదాడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రోగికి మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పెండెం వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ వెంకటేశ్వర్లు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యులు, ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

## - విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

## - కస్తూరిబా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సర్పంచ్ దున్నా శ్రీనివాస్

**నడిగూడెం, అక్టోబర్ 03, ప్రజా జ్యోతి:**

విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. భోజనం నాణ్యత, మెనూ అమలు తీరును పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు మెస్ ఛార్జీలను పెంచిందని తెలిపారు. రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలు పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు.కార్యక్రమంలో ఎస్ఓ వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.



# చిట్టీలు,అధిక రాబడుల పేరుతో రూ.6.24 కోట్ల వసూళ్లు

## - ప్రభుత్వ ఉపాధ్యాయుడు,భార్య అరెస్ట్- ఇంకా రూ.3.05 కోట్ల బకాయిలు..

## బాధితులు పోలీసులను సంప్రదించాలి- డీఎస్పీ ప్రసన్నకుమార్

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 03(ప్రజా జ్యోతి):**

చిట్టీలు,డెయిలీ కలెక్షన్లు,అధిక రాబడుల పేరుతో ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి మోసానికి పాల్పడిన కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు,అతని భార్యను చివ్వెంల పోలీసులు అరెస్ట్ చేశారు.చివ్వెంల మండలం యెనగండి తండాకు చెందిన బానోత్ రాజు (44),అతని భార్య బానోతు అనూష (33)ను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు.సూర్యాపేట డివిజన్ డీఎస్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు.పోలీసుల దర్యాప్తు ప్రకారం రాజు 2015 నుంచి డెయిలీ కలెక్షన్లు,చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ అధిక రాబడులు,నెలవారీ చెల్లింపులు ఇస్తామని నమ్మించి ప్రజలు,తోటి ఉద్యోగులు,పరిచయస్తుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు సేకరించినట్లు తెలిపారు.చిట్టీల గడువు పూర్తయినప్పటికీ డబ్బులు తిరిగి చెల్లించకుండా మోసానికి పాల్పడినట్లు పేర్కొన్నారు.భూముల కొనుగోలు పేరుతోనూ పలువురి నుంచి నగదు తీసుకున్నట్లు, సేకరించిన మొత్తంలో కొంత భాగాన్ని వ్యక్తిగత అవసరాలు, ఆస్తుల కొనుగోలుకు వినియోగించినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు.మిగిలిన మొత్తాన్ని సుమారు 500600 మందికి అప్పుగా ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారని తెలిపారు.

**రూ.3.05 కోట్ల బకాయిలు**

ఇప్పటివరకు జరిగిన దర్యాప్తులో బాధితుల నుంచి రూ.6.24 కోట్లు వసూలు చేసినట్లు గుర్తించగా,అందులో రూ.3.18 కోట్లు తిరిగి చెల్లించినట్లు పోలీసులు తెలిపారు. ఇంకా రూ.3.05 కోట్ల మేర బకాయిలు ఉన్నట్లు వెల్లడించారు. ప్రామిసరీ నోట్లు, చెక్కులు,బాండ్లు, భూముల లావాదేవీలు,నగదు సేకరణచెల్లింపులకు సంబంధించిన అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

**బాధితులు పోలీసులను సంప్రదించాలి**

నిందితుల చేతిలో మోసపోయిన ఇతర బాధితులు ఎవరైనా ఉంటే తమ వద్ద ఉన్న ఆధారాలతో వెంటనే చివ్వెంల పోలీసులను



సంప్రదించాలని డీఎస్పీ కోరారు. అధిక రాబడులు, చిట్టీలు, పెట్టుబడుల పేరుతో ప్రజలను మోసం చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.విలేకరుల సమావేశంలో సూర్యాపేట రూరల్ సీఐ జి. రాజశేఖర్, చివ్వెంల ఎస్ఐ వి.మహేష్,ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.కేసు దర్యాప్తులో కీలకంగా పనిచేసిన పోలీసు సిబ్బందిని అధికారులు అభినందించారు.

# భక్తులాపురంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### - గ్రామ సర్పంచ్ జుట్టుకొండ యమునా గణేష్ ఆధ్వర్యంలో పంపిణీ

**పెన్ పహాడ్ , అక్టోబర్ 3(ప్రజా జ్యోతి):**

మండల పరిధిలోని భక్తులాపురం గ్రామంలో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ జుట్టుకొండ యమునా గణేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ జుట్టుకొండ యమునా గణేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు, రేషన్ సరుకులు ప్రతి ఒక్క లబ్ధిదారునికి సక్రమంగా అందాలనే ఉద్దేశంతో ఈ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ పరిధిలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా పంచాయతీ పాలకవర్గం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆమె పేర్కొన్నారు. రేషన్ పంపిణీలో పారదర్శకత కోసం ఈ కార్డులు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యర్రం శెట్టి సైదయ్య, పంచాయతీ కార్యదర్శి శివ నాయక్, రేషన్ డీలర్ బుస పాపయ్య, ప్రముఖ నాయకులు నల్లపు రామ్మూర్తి, పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# విద్యుత్ కోతలపై భగ్గుమన్న బీఆర్ఎస్.. సబ్‌స్టేషన్ ముట్టడి

## రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

### - మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి





**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి):**

రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ మండల, పట్టణ పార్టీ ఆధ్వర్యంలో శనివారం భూదాన్ పోచంపల్లి సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి హాజరై బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కనీసం 10 గంటల విద్యుత్ కూడా సక్రమంగా అందించకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సుమారు గంటన్నర పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీత వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, కందడి భూపాల్ రెడ్డి, రావుల శేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సిలువేరు బాలనర్సింహ, బత్తుల శ్రీశైలం గౌడ్, ముత్యాల మహిపల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, పిసర్ల మహిపల్ రెడ్డి, పెద్దల చక్రపాణి, గునిగంటి మల్లేష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి..ప్రతి 30 కి.మీ.కు అంబులెన్స్, క్రేన్, హెల్పర్ ఏర్పాటు చేయాలి..

## - జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్






**నల్గొండ అక్టోబర్ 3,(ప్రజా జ్యోతి):**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. నేషనల్ హైవేలపై ప్రతి 30 కిలోమీటర్లకు ఒక అంబులెన్స్, క్రేన్, హెల్పర్‌ను అందుబాటులో ఉంచాలని అన్నారు.శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా రోడ్డు భద్రత కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని , 26 మంది అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ నిరంతరం రోడ్డు భద్రతను పర్యవేక్షించాలని ,జంక్షన్ల వద్ద ఒక్క ప్రాణం కూడా కోల్పోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.మిర్యాలగూడ,నందిపాడు రహదారి, చిట్యాల --నార్కట్‌పల్లి, కొండమల్లేపల్లి, ఆలగడప, డిండికొండపల్లి, నార్కట్‌పల్లివాడపల్లి మార్గాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, దామరచర్ల రైల్వే బ్రిడ్జి, లైటింగ్ ఏర్పాటు చేయాలని కట్టంగూర్ పెట్రోల్ బంక్ ప్రాంతాల్లో అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని .ఎన్‌హెచ్-65పై ఆక్రమణలను తొలగించాలని, రోడ్లపై వాహనాలు నిలిపి ఉంచకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్ల ఆక్రమణలను తొలగించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని, జిల్లాలోని బ్లాక్‌స్పాట్లను గుర్తించి తదుపరి సమావేశం నాటికి వాటి సంఖ్యను తగ్గించేలా కార్యాచరణ రూపొందించాలని , రోడ్డు ప్రమాదాల నివారణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నేషనల్ హైవేలపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ వైద్యసేవలు అందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో ట్రామా కేర్ హెల్త్ సెంటర్ల ఏర్పాటుకు సీఎస్ఆర్ నిధులను వినియోగించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ... మిర్యాలగూడ పట్టణంలోకి లారీల రాకపోకలకు సమయపాలన విధించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఎన్‌హెచ్-65 పరిధిలో ప్రమాదాలకు కారణమవుతున్న డాబాల దగ్గర లారీలను ఆపకుండా చూసుకోవాలనీ సంబంధిత డాబాల యజమానులతో ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించాలని, జిల్లాలో ప్రస్తుతం 30 బ్లాక్‌స్పాట్లు ఉన్నాయని, తదుపరి సమావేశం నాటికి వాటిని తగ్గించేలా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని చెప్పారు.ఈ సమావేశానికి రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ శ్రీవాణి ,జిల్లా రెవిన్యూ అధికారి దశరథ , జాతీయ రహదారులు ఆర్ అండ్ బి పంచాయతీరాజ్, ఎక్సైజ్ తదితర శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

---

# అర్హులకు 'స్మార్ట్' రేషన్ కార్డుల పంపిణీ!

# పేద కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## - టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తూముల భుజంగరావు

**పెన్ పహాడ్, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం పెన్ పహాడ్ మండలంలో శనివారం పండుగ వాతావరణంలో జరిగింది. మండల కేంద్రమైన పెన్ పహాడ్‌తో పాటు ధూపహాడ్ గ్రామాలలో అర్హులైన లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తూముల భుజంగరావు ముఖ్య అతిథిగా హాజరై, ఆయా గ్రామాల సర్పంచులు ఒగ్గు రవి, నన్నెపంగా కమలమ్మ సైదులుతో కలిసి లబ్ధిదారులకు కార్డులను



అందజేశారు.ఈ సందర్భంగా తూముల భుజంగరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి అర్హత కలిగిన పేద, మధ్యతరగతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నదే లక్ష్యమని స్పష్టం చేశారు. "పేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందించడంలో రేషన్ కార్డులు అత్యంత కీలకమైనవి.




అర్హత ఉండి, సాంకేతిక కారణాల వల్ల ఇప్పటివరకు కార్డులు లేని కుటుంబాలను త్వరలోనే గుర్తించి, వారికి కూడా కొత్త రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది" అని ఆయన హామీ ఇచ్చారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు, ప్రభుత్వ ఇతర సంక్షేమ పథకాలకు ఈ స్మార్ట్ కార్డులు ఒక రక్షణ కవచంలా ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో చెట్ల ముకుందాపురం సర్పంచ్ పొనుగోటి నరేందర్,రెవెన్యూ ఇన్స్పెక్టర్ రంజిత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, స్వప్న , జిపిఓ సంధ్య, మాజీ జెడ్పీటీసీ పిన్నమనేని కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ ఆర్తి నరేష్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల మధు, డీలర్లు నిమ్మల రాజు, డి. అనురాధ, సుగుణ, పేరూరి వెంకటేశ్వర్లు, షేక్ నజీర్, శ్రవణ్, నాయకులు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

---

# రెడ్‌క్రాస్‌లో నామినేషన్ల జోరు..

## -15 స్థానాలకు 33 మంది నామినేషన్లు..

## తొలిసారి భారీగా పోటీ..

## నామినేషన్లతో వేడెక్కిన రెడ్‌క్రాస్ ఎన్నికలు..

**నల్గొండ అక్టోబర్ 3,(ప్రజా జ్యోతి):**

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నల్గొండ జిల్లా శాఖ నూతన పాలకవర్గం ఎన్నికలకు నామినేషన్ల పర్వం జోరుగా సాగింది. రాష్ట్ర శాఖ నిర్ణయం మేరకు జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో 20262029 కాలానికి 15 మంది సభ్యులతో కూడిన మేనేజింగ్ కమిటీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు.ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల స్వీకరణ జరిగింది. ఎన్నికల అధికారి టి. మమత, జాయింట్ రిజిస్ట్రార్, జిల్లా సహకార అధికారి కార్యాలయం, నల్గొండ ఆధ్వర్యంలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.లయన్ డాక్టర్ గోలి అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్యానెల్ నుంచి 16 మంది నామినేషన్లు దాఖలు చేయగా, ఇతరుల నుంచి మరో 17 మంది నామినేషన్లు సమర్పించారు. మొత్తం 33 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి టి. మమత తెలిపారు.నల్గొండ రెడ్‌క్రాస్ సొసైటీ చరిత్రలో మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు ఇంత పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు కావడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. దీంతో ఎన్నికలపై సభ్యుల్లో ఆసక్తి నెలకొంది.

### 11న ఎన్నికలు...



సోమవారం నామినేషన్ల పరిశీలన, మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగనుంది. ఏకగ్రీవం కాని పక్షంలో ఈ నెల 11న జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ భవన్‌లో ఎన్నికలు నిర్వహించనున్నారు. జాయింట్ రిజిస్ట్రార్, జిల్లా సహకార అధికారి పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ జరగనుంది.అదే రోజు ఎన్నికైన 15 మంది మేనేజింగ్ కమిటీ సభ్యులు సమావేశమై జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారి, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యులను



ఎన్నుకోనున్నారు. దీంతో నూతన పాలకవర్గం ఏర్పాటు ప్రక్రియ పూర్తికానుంది.